# మామగారి సైకిలు

సాయంత్రం నాలుగున్నర గంటలు కావొస్తూంది. మేడగదిలో కూర్చుని వక్కపొడి నములుతూ ఆ దినమే వచ్చిన కొత్తపత్రిక తిరగవేస్తున్నా. సన్న సన్నగా రేడియో సిలోన్‌నుంచి తెలుగుపాటలు వినవస్తున్నాయి. శ్రీమతిమాత్రం కాలుకాలిన పిల్లిలా, మాటి మాటికి మేడ వరండాలోకి వెళ్లి కృష్ణ వస్తున్నాడేమోనని ఆశగా చూస్తూంది. కొంతసేపటికి చిన్నబుచ్చుకున్న ముఖంతో లోనికివచ్చి "వాడు ఎప్పుడూ ఇంతే. అసలు మనం సినీమాకు వెళ్తాం ఎడ్వాన్సుటిక్కట్లు తేవాలి అన్న మాటే మరచిపోయిఉంటాడు" అంది నిరుత్సాహంగా. ఆమె ముఖంచూస్తే చెడ్డ జాలి వేసింది.

"బాగానే ఉంది. అయితే నన్నేం చెయ్యమంటావు?" అన్నా.

"పోనీ మీరే వెళ్ళి అడ్వాన్సుటిక్కట్లు కొనుక్కునిరండి. ఆ తరువాత ఇద్దరం కలిసి వెళ్దాం" అంది.

మా వివాహమై ఇంకా మూడు నెలలైనా కాలేదు. కొత్తమోజు. దానికితోడు ఒకరిని ఒకరు అర్థంచేసుకుని ఎంతో అన్యోన్యంగా రోజులు గడుపుతున్నాం. పైగా ఉద్యోగ రీత్యా తెలుగుదేశానికి దూరంగా ఉండడం నుంచి తెలుగుదేశంలో ఉన్న ఈ వారం రోజులలోనైనా వీలైనన్ని తెలుగు సినీమాలు చూడకపోతే ఆ తరువాత ఎంతో కాలం దాకా ఎలాగూ వీలుపడదు. అంచేత కాస్త బద్ధకంగా ఉన్నా లేని ఓపిక తెచ్చుకుని, శ్రీమతి సలహాను పాటించి బట్టలు వేసుకుని, ఎడ్వాన్సు టిక్కట్లు కొనడానికై బయలుదేరా.

తీరా బయలుదేరేముందు "ఇదుగో చూడండి. మా నాన్నగారి సైకిలు తీసుకుని వెళ్లండి, ఇట్టే వచ్చేద్దురుగాని" అంది.

ఇదీ బాగానే ఉందనుకొని మా మామగారి సైకిలుని ఒక్కసారి పరీక్షగాచూశా.




నారసింహ లేహ్యాము

బంగారుతో చేరినది. మేహము, ఏక్షాత, నిస్సత్తువవగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును 20 తు డబ్బీ రు. 3-4-0 పోస్టేజిరు 1-1-0

పి. వి. ఎ అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా.


అంతవరకూ నిజానికి నా దృష్టి ఆ సైకిలుమీద ఎన్నడూ పడలేదనే చెప్పాలి. బహుశా హెర్క్యులెస్‌సంస్థ స్థాపించినపుడు మొదటిసారిగా తయారుచేసిన సైకిలు మామగారి పూర్వీకు లెవ్వరికో ఇచ్చిఉంటారు, (డబ్బుకే అనుకోండి.) ఆ తరువాత అది వంశపారం పర్యంగా ఒకరి తరువాత ఒకరికి, తండ్రీకొడుకుల మధ్య వెలలేని కానుకగాను చేతులుమారుతూ కొన్నితరాల వ్యక్తులకు తన శాయశక్తులా సేవ చేసి చేసి కొసకు తన యావచ్ఛక్తినీ, సౌందర్యాన్నీ పోగొట్టుకుని, అవయవలోపంతో అస్థిపంజరంలా ఉండి కూడా, విశ్వాసాన్ని కోల్పోకుండా ప్రస్తుతం మా మామగారి కాళ్లక్రింద నలుగుతూంది. నిజానికి ఇలాంటిసైకిలు తొక్కడానికి నాకు అర్హత లేదనిపించి, పైగా


పి. నరసింగరావు


తొక్కడం నావల్ల కాదేమోనని భయపడి ఇక సైకిలు బాగులేదనీ, పాతదనీ శ్రీమతి మనస్సు నొప్పించడం ఇష్టంలేక "లక్ష్మీ ఇప్పుడేగా వద్దంటున్నా వినకుండా బలవంతంగా కడుపునిండా ఫలహారంపెట్టేవు? ఈ మధ్య బాగా అలవాటు తప్పడంనుంచి వెంటనే సైకిలుతొక్కితే ఆయాసం వస్తుందేమో? అంచేత రిక్షాలోనే వెళ్లివస్తా. అదే రిక్షాలో తిరిగి మనంఇద్దరం వెళ్లిపోవచ్చు ఏం? అన్నా.

అప్పటికే వ్యవధి దాటిపోతూ ఉండడం నుంచి "సరే వేగం వెళ్ళిరండి. ఈలోగా నేనూ సిద్ధంగా ఉంటా" అంది.

బ్రతుకు జీవుడా అనుకుని బయలుదేరా.

* * *

ఆ మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకల్లా నిత్యకృత్యాలన్నీ పూర్తిచేసుకుని టిప్‌టాప్‌గా తయారై ఎగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటరుగా పనిచేస్తున్న నా స్నేహితుడు వెంకట్రావు వద్దకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నా.

శ్రీమతి రెండోసారి ఒకకప్పుడు వేడి వేడి కాఫీ ఇచ్చి, "ఎగ్రికల్చరల్ ఫారం సుమారు మూడుమైళ్ళుంటుంది. ఎలా వెళ్దామనుకుంటున్నారు?" అంది నా ముఖంలోకి చూస్తూ.

"సిటీబస్‌లో వెళ్తా" అన్నా ధీమాగా.

"ఆ పక్క సిటీబస్సులు వెళ్ళవు. రూటు బస్సులుకూడా ఏ రెండు మూడు గంటలకో గాని ఒకసారి దొరకవు", అంది.

"సరే అలా అయితే ఒక రిక్షా మాట్లాడుకొని వెళ్ళివస్తా" అన్నా.

"మాటిమాటికి రిక్షాలకు తెగఖర్చుపెడుతున్నారు. ఎంత మూటగట్టుకు వచ్చారేం? అందుకే నెలకు నూటఏభై రూపాయిలు వస్తున్నా మీకు సరిపోవడంలేదు" అంది.

"అయితే నన్నేం చెయ్యమంటావు?" అన్నా ఏ ఆలోచనాపాలుపోక.

"చక్కగా మా నాన్నగారి సైకిలు తీసుకునివెళ్ళి పదకొండు గంటలకల్లా తిరిగి వచ్చేయండి. కానీ ఖర్చుండదు", అంది.

"మరి మీ నాన్నగారు ఆఫీసుకువెళ్లరా?" అన్నా.

"నిన్ననూ ఈ వేళా, ఏదో కోర్టుపని ఉందిట. అంచేత సైకిలు తీసుకువెళ్ళడం లేదు".

"అదికాదు లక్ష్మీ. అది మీ ముత్తాతల సొత్తు. దాన్ని చూస్తేనే భయమేస్తుంది. అసలు నడుస్తుందా?" అన్నా నవ్వుతూ.

ఆమె ముఖం కాస్త చిన్నది చేసుకుని, "కాస్త పాతదైందని మీకన్నీ వేళాకోళాలే. మరీ అంతపనికి రాకపోతే మా నాన్నగారు రోజూ దానిమీద ఎలాగు వెళ్తున్నారో?" అంది.

ఇంకా ఏదో సర్ది చెప్దామని ప్రయత్నిస్తున్న నన్ను చెప్పనియ్యకుండా, "ఆ బంట్రోతు ఉన్నాడన్నమాటేగాని ఎంత చెప్పినా ఒక్కనాడైనా ఆ సైకిలు తుడవడు. ఇక కిష్టిగాడి సంగతి అసలే చెప్పక్కరలేదు. రాత్రి పగలూ సందుదొరికినపుడల్లా దానిమీదసవ్వారి. అంచేతే అలా పాతదానిలా తయారయిందికాని, దానికేం బంగారంలాంటిది! నిర్భయంగా మీరు తీసుకు వెళ్ళండి", అంది గుక్క తిప్పుకోకుండా.

ఇది స్వల్ప విషయం. దీనికోసం పోనని, కాదనీ, వాదన లెందుకని "సరేలే దీనిమీదే వెళ్ళివస్తా" అని సైకిలు తీసుకుని బయలుదేర బోతున్నా.

"ఉండండి ఉండండి" అని శ్రీమతి ఒక పాతగుడ్డ తీసుకువచ్చి హేండిల్ బారు, సీటు, వగైరాలు కాస్త తుడిచి 'ఇక వెళ్ళండి' అని నవ్వుముఖంతో వీడ్కోలు ఇచ్చింది.

తీవ్రమైన మశూచికం పడ్డవాడి ముఖంలా హేండిల్ బారు రూపురేఖలు లేకుండా గంట్లతోనూ, సొట్టలతోనూ నిండిపోయింది. ఒక పెడల్ కఱ్ఱది. మరొక పెడల్ అసలే లేదు. కేవలం ఇనుప ఊసనుమాత్రం ఆధారం చేసుకుని తొక్కాలి. ముందు చక్రం బ్రేకు పూర్తిగా తీసివేయబడి ఉంది. ఇక ఒకొక్క టైరుకు ఎన్నెన్ని అతుకులు ఉన్నాయో ఆ భగవంతుడికే తెలియాలి. ఇక ఇలా సైకిలుకున్న లోపాలన్ని ఎంచుతూ కూర్చుంటే మరింత నిరుత్సాహంగా ఉంటుందనుకుని, ఆలస్యం చెయ్యకుండా సైకిలు వీధిలోకి తీసుకువెళ్ళి ఆసీనుణ్ణి అయ్యా.

మా మామగారి ఇల్లు బాగా ఎత్తయిన ప్రదేశంలో ఉండడంనుంచి రెండు మూడు ఫర్లాంగులు తొక్కనక్కర లేకుండానే సదుపాయంగా వెళ్ళిపోయా...

ఇక బాధలేదు. తేలిగ్గా వెళ్ళి రావచ్చు అనుకుని ధీమాగా తొక్కుతున్నా. ఇంతలో ఎగుబాటు, గతుకులరోడ్డు వచ్చింది. దాంతో బెల్ కొట్టక్కరలేకుండానే ఫైరింజన్ గంటలా మ్రోగనారంభించింది. దీనికితోడు వెనక మడ్ గార్డు బోల్టు ఊడిపోవడం నుంచి కాబోలు ఒకటే బడబడ చప్పుడు. అలా సుమారు పది గజాలు వెళ్ళేనో లేదో పట పట పళ్ళు కొఱికి చైను కాస్తా జారిపోయింది. 'చచ్చాంరా భగవంతుడా' అనుకుని క్రిందకు దిగి చైను ఎక్కించి మళ్ళీ కూర్చున్నా. సైకిలు తొక్కుతున్నా నన్నమాటే గాని ప్రతీపదిగజాలకు ఒకసారి చైనుజారిపోతూనే ఉంది. దిగి చైను ఎక్కిస్తున్నా. పంట్లానికి పిన్నులుగాని క్లిప్పులుగాని పెట్టుకోకపోవడం నుంచి అడుగున నల్లగా తయారైంది. ఇక చేతుల మాట చెప్పక్కరలేదు. వేళ్ళన్నీ నల్లగా జిడ్డుతో నిండిపోయాయి. పోనీ ఏదైనా సైకిలుషాపు కనిపిస్తే తాత్కాలికంగానైనా బాగుచేయిద్దామంటే ఎక్కడా కనబడలేదు. సరే, 'రోట్లో తలపెట్టిన తర్వాత రోకలిపోటుకు వెరచేదేముం'దని 'ఏమయితే అదే ఔతుంది. అంతగా నడవకపోతే నడిపించుకుని వెళ్ళవచ్చును కదా' అనుకుని ముందుకు పడుతూ లేస్తూ సాగిపోతున్నా. ఎలాగయితేనేం ఎగుబాటంతా దాటి ఊరవతల ఉన్న నాలుగురోడ్ల కూడలికి వచ్చా. ఎలా పసిగట్టేడో గాని, నాపాలిటి యమధర్మరాజులా, ఆమడదూరం ఉండగానే, ఆమధ్య నిలబడ్డ పోలీసు "ఏమండోయ్ సార్ మిమ్మల్నే. ఇలారండి", ఒక్క గావుకేక వేశాడు. తప్పని సరిగా దగ్గరకు వెళ్ళా...

ఒక్కసారి ఎగాదిగా సైకిలునూ, నన్నూ పరీక్షించి, "ఏదండీ ముందుచక్రం బ్రేకు ఏదీ? ఏదీ బెల్ మ్రోగదేం?" మీ పేరూ వగైరాలు చెప్పండి అని ఆరంభించాడు.

అదేం ఖర్మమోగాని అంతవరకూ ఫైరింజనులా మ్రోగుతున్న బెల్ ఆ కానిస్టేబుల్ చెయ్యి పడేసరికి పక్షవాతంవచ్చి నోరు పడిపోయినట్టుగా ఊరుకుంది.

కాస్త ధైర్యం కూడగట్టుకుని "అదేమిటయ్యా వెనుక బ్రేకు ఉంది చాలదూ?" అన్నా.

"అల్లే ఈఊర్లో అది పనికిరాదు. రెండు బ్రేకులూ ఉండి తీరాలి. అదిగాక మీ బెల్ పనికిరాదు. పైగా రాంగ్ సైడునవస్తున్నారు" అని దబాయించాడు.

"ఈవేళ ఉండి రేపు వెళ్ళిపోవలసిన వాణ్ణి నన్ను పట్టుకుని బాధిస్తే నీకేంవస్తుందయ్యా" అన్నా ఎలాగైనా ఈ పీడ వదిలించుకుందామని.

ఇంతలో ఆ ప్రక్కనే ఉన్న హెడ్ కానిస్టేబుల్ కాస్త దగ్గరగా వచ్చి, "అబ్బ ప్రొద్దుటనుంచీ కాఫీతాగలేదయ్యా" అంటూ కానిస్టేబులుతో తన కష్టసుఖాలు చెప్పుకున్నాడు.

ఇక వీళ్ళతో పేచీలుపడి లాభంలేదు. ఆ తరువాత కోర్టులవెంట ఎవడు తిరుగుతాడనుకొని పర్సులోనుంచి ఓ అర్ధరూపాయి తీసి చదివించుకున్నా.

చిరునవ్వు ముఖంతో ఆ అర్ధరూపాయి అందుకుని "చూడండిసార్. ఈ సైకిలుకు లైసెన్సుకూడా ఉన్నట్లులేదు. ఇలా తిన్నగా వెళ్ళేరంటే అక్కడ మ్యునిసిపాలిటీవాళ్ళు కాచుకుని కూర్చున్నారు. అంచేత ఈ పక్కసందులో నుంచి వెళ్ళిపొండి" అని సలహా యిచ్చేడు.

సరేనని పక్కసందులోంచి బయలుదేరా. రోడ్డుకూడా బాగానే ఉంది. ఓ ఫర్లాంగు వెళ్లేనో లేదో ఎవరో మంత్రించినట్లు ఫ్రీవీలు పని చెయ్యడం మానివేసింది. క్రిందకు దిగేసరికి, సీటుకూడా నాతోబాటే లేచి క్రిందపడింది. అర్ధాంగిని మనస్సులోనే తిట్టుకుంటూ కిందపడ్డ సీటుతీసి ధూళిదులిపి మళ్ళీ యధాతధంగా అమర్చేను. కాని ఎంత ప్రయత్నించినా పనిచెయ్యక కూర్చున్న ఫ్రీవీలును ఏంచెయ్యాలో తోచక దిక్కులు చూస్తున్నా. ఇంతలో ఆ త్రోవనే సైకిలుమీద వెళ్తున్న ఆసామి నన్ను చూచి

"ఏమయిందండీ?" అన్నాడు.

"ఫ్రీవీలు పని చెయ్యడంలేదు" అన్నా. అతను తన సైకిలుకు స్టేండువేసి, నా సైకిలును పుచ్చుకుని రెండుమూడు సార్లుమీదకు ఎత్తి నేలను పడేశాడు. దాంతో ఫ్రీవీలు సర్దుకుంది.

"చూడండి. పెడల్సు వెనక్కు తొక్కారంటే మళ్లీ ఫ్రీవీలు జారిపోవచ్చు" అని సలహాయిచ్చి అతను తన సైకిలు ఎక్కేడు.

ఆయనకు థేంక్సు చెప్పి మళ్ళీ బయలుదేరా...

ఎలాగయితేనేం అష్టకష్టాలూ పడి సుమారు పదకొండు గంటలకల్లా ఫారం చేరుకున్నా—

తలనొప్పితో, మనస్సు ఎంతో చికాకుగా ఉన్నా, వెంకట్రావు ఆదరణతోనూ, తియ్యటి కబుర్లతోనూ కొద్దిసేపట్లోనే మళ్లీ మామూలు మనిషిని అయ్యాను. ఎక్స్పెరిమెంటల్ బేసిస్ క్రింద, ఫారంలో పెంచుతున్న రకరకాల పళ్ళచెట్లు, పువ్వులచెట్లు, చూపించాడు. ప్రత్యేకమైన శ్రద్ధతో, ఆధునికమైన పద్ధతులతో పెంచిన, చెట్ల, మొక్కల, కాయలు, పువ్వులు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఎంతగానో ఆకర్షించాయి.

తీరా నేను బయలుదేరి వచ్చేముందు, 'నీ మామగారి సైకిలు వదిలివెయ్యి. మా బంట్రోతు తెచ్చి మీ ఇంటికి ఇస్తాడు. నువ్వు మా ఆఫీసు సైకిలుమీద వెళ్ళిపో" అన్నాడు.

'అలాగే' అన్నా.

"అయితే శ్రీమతితో కూడా కొత్తకాపురానికై ఎల్లుండి బయలుదేరడం ఖాయం అన్నమాట" అన్నాడు నవ్వుతూ...

"లేకపోతే ఇంకా ఎంతకాలం ఆలు ఉండికూడా వంటరిజీవితం గడపమంటావు?" అన్నా.

ఇద్దరం నవ్వుకున్నాం. శెలవు తీసుకుని ఇంటిముఖం పట్టేను...

* * *

సైకిలు కొత్తదేమో సునాయాసంగా ఇరవై నిముషాలలో ఇల్లు చేరుకున్నా. అప్పటికి పన్నెండున్నర కావొస్తూంది.

(55-వ పేజీ చూడండి)



# ★ రసాభాసం ★

(19-వ పేజీతరువాయి)

నాకు! ఏదీ ఆ సరోజనిని అడిగి చూడమనండి.'

'నాయనా! అల్లాటప్పాగా ఆ మాట అనడం ఆచారమైపోయిన నీలాంటి మగ శాయుళ్లందరూ నిజంగా అంతపనికీ సిద్ధమైతే వాళ్లు తప్పకుండా అడిగి చూసేవుందురు. ఎందుకీ రొడ్డగొట్టు మాటలుగాని ఆ శపథాల కికమీద ఎందుకే నా మంచిది 'అవసరమైతే' అని ఒక ముక్క కూడా చేర్చుకోండి నిజంగా అలాంటి శపధమే చెయ్యవలసిన అవసరం పడితే'

'ఆ ముక్క ఎప్పుడూ వుండనేవుందండి. అది అధికార సూత్రంబు'

'మరెందుకూ ఈ తర్జన భర్జన లన్నీను! అసలు సంగతి తేల్చేస్తున్నాను. కొంపదీసి ఆ సరోజని నిన్నుగూడా ప్రేమించిందేమిటి! అది చెప్పముందు'

'ఏమిటి! మీ రెవరితో మాట్లాడుతున్నారో తెలుసా?'

'నీ యివాళ యొక్క రేపటి నేను నా నిన్నటి ఆత్మస్వరూపంతో మాట్లాడుతున్నాను'

'ఏమిటో మీమాటలు నాకయోమయంగా వున్నాయి. అసలు మీధోరణే నాకేమిటో విడ్డూరంగావుంది!'

'విడ్డూరమేమీ లేదు నాయనా! ఇంక సరిగ్గా పదిరోజుల్లో నీకళ్ళు పచ్చబారతాయి. అంటే మరేంకాదు నీకొక శుభలేఖవస్తుంది. అందులో మరేంలేదు, సరోజనీ శ్రీనివాసరావుల వివాహముహూర్తం ఎక్కడ ఏరోజున ఎన్నింటికి జరిగేదీ సువర్ణాక్షరాలతో (గిల్టులెటర్సుతో) అచ్చువేయబడివుంటుంది, అడుగున ఆహ్వానము చందనతాంబూలాది సత్కార ప్రసక్తివుంటుంది. ఇంకా అడుగున పవర్ప్రెస్ వివరాలుంటవి అంతే!'

'ఏమి శేమిటీ! ఈ కులట కాచవటా దొరికాడు! వాడు వటి శఠుడు! ధృష్టుడు! కాదు కాదు మరొకరితో లేచిపోయిన తన భార్య కోసం ప్రాధేయపడిన పరమ దౌర్భాగ్యుడు!'

'వత్సా! శాంతింపుము! శాంతింపుము! మరిప్పుడామె నిన్ను ప్రేమిస్తూవున్నా ఏమయినట్టు?'

'ఏముందీ ఎటుచూసినా రసాభాస!' అని ఒక దీర్ఘనిశ్వాసం విడిచాడు గంగాధరం.

'అనుచిత విభావాలంబనత్వం రసాభాసత్వమ్"అనే రసగంగాధర సూత్రం తక్కిన అలంకారిక సూత్రాలకన్నా చాలా సార్ధకమైనట్లు బోధపడింది కదూ!'

'చిత్తం!'

'ప్రకృతం తే ద్వాదశీమావస్థా ప్రాప్తిరస్తు! పునరభ్యుదయ పరంపరాభివృద్ధిరస్తు!' అని ఆశీర్వదించి అప్పటి కంతర్ధానమైపోయాడు తథాగతుడు సమాగ్యభాగ్యగతుడు-ఆ విద్యార్థిలో ఆసన్న భవిష్యత్తులో అవతరించబోయే ఉపాధ్యాయాంశారిరంసువు. ★

---

## తెల్ల వెంట్రుక లుండవు

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేదపద్ధతిలో తయారైనది 56 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును ఇదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞానశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 5; 3 సీసాలు రు. 12. సగము నెరసివుంటే ఒకసీసా రు. 6; 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/-లు పనిచేయకిదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి హామీ.

INDRA AYURVED BHAVAN,
(A P.) P.O Rajdhanwar (H Bagb).

---

## మామగారి సైకిలు

[29-వ పేజీ తరువాయి]

భోజనం చెయ్యకుండా, నా రాక కోసమై నిరీక్షిస్తున్న శ్రీమతి కొత్త సైకిలును చూచి ఆశ్చర్యం వెలిబుచ్చింది.

కాని సమాధానం చెప్పకుండానే మేడ మీదకు వెళ్ళి బట్టలు మార్చుకుంటున్నా.

"అయ్యయ్యో కొత్త సిల్కుపంట్లాం అంతా ఏమిటి, ఇలా తయారైంది?" అంది శ్రీమతి పంట్లాన్ని తీసుకుని చూస్తూ.

మౌనంగా ఊరుకున్నా.

"ఆ సైకిలును ఏంచేశారు?" అం..

"వీధి కాలువలో పారేశా," అని నా మనస్సులోని కోపమంతా వెళ్లబుచ్చుతూ ఇంకో నాలుగు మాటలు ఘాటుగా అంటించా...

పరిస్థితి అవగాహన చేసుకుని "అయ్యో అది అంత బాగులేదు, నడవదు అని తెలిస్తే మిమ్మల్ని ఎందుకు తీసుకువెళ్ళమని బలవంత పెడతాను. మీరు ఇబ్బందిపడడం నాకు సరదావా?" అని క్షమాపణ వేడుకుంది.

తలకు స్నానంచేసి, నాకు యిష్టమయిన చీరా జాకెట్టుతో, కోపంతో నేను నాలుగు మాటలన్నా లక్ష్యపెట్టకుండా, శాంతంగా, సౌమ్యంగా, అమాయకంగా, క్షమాపణ వేడుకొంటున్న శ్రీమతిని చూచేసరికి మెత్తబడ్డా.

దగ్గరకు తీసుకున్నా...

రాత్రి భోజనాలదగ్గర "తను సైకిలు తీసుకెళ్ళేరు. ఏమీ నడవడం లేదట. త్రోవలో ఎంతో ఇబ్బందిపడ్డారు. బాగు చేయించకూడదా?" అంది మామగారితో.

"ఆ...ఆ...అదే నేనూ అనుకుంటున్నా వెధవది ఎప్పటికప్పుడు అశ్రద్ధ అయిపోతూంది...ఇంతకూ అది మనకేతప్ప మరొకరికి లొంగదే" అన్నారు నవ్వుతూ.

అందరం నవ్వుకున్నాం...

* * •

అనుకున్నట్టు శ్రీమతితో సహా కొత్త కాపురానికి వెళ్ళిపోయా...ఆరు నెలల తరువాత పండుక్కి వచ్చాం...కాని నా దృష్టి అంతా ఆ సైకిలుమీదే ఉంది. సైకిలు తీసుకుని వీధిలోకి వెళ్తున్న మా బావమరిది కృష్ణను పిలిచి "ఏమోయ్ నేను క్రిందటిసారి వెళ్ళిన తరువాత సైకిలు బాగు చేయించారా? లేదా?" అన్నా.

"ఆ ఎవరికండీ అంతశ్రద్ధా, తీరికా" అని సైకిలు ఎక్కి వెళ్లిపోయాడు. ఆనాటికీ ఈనాటికి సైకిలు బాగు చేయించనేలేదు. లైసెన్సు కట్టడం అసలే అలవాటు లేదు. పోనీ మామగారు అంత బొత్తిగా జరుగుబాటు లేనివాళ్ళా అంటే నెలకు రెండు వందల ఏభైరూపాయల జీతం. దీనికంతా ఏమిటి కారణం అని ఆలోచించగా "ఆ... ఆ...అదే నేనూ అనుకొంటున్నా... అయినా వెధవది ఎప్పటికప్పుడే అశ్రద్ధ అయిపోతూంది" అన్న మామగారి మాటలు సమాధానంగా గుర్తుకొచ్చాయి... ★

